# తెల్సుకున్న నిజం

— తమిరిశ జానకి.

ఆ రోజూ ఎప్పట్లాగే తెల్లారింది. గుడిసె లోంచి ఆవలిస్తూ బయటికొచ్చి వేప పుల్లొకటి విరుచుకుని నవుల్తూ అటూ, ఇటూ దృష్టి సారించాడు రామయ్య. నల్ల కుక్క కుయ్యి మంటూ వచ్చి అతని కాళ్ళకానుకుని నిలబడింది తోకాడిస్తూ.

"ఉండెహే" అని ముద్దుగా దాన్ని విసుక్కున్నాడు. అది వదల్లేదు. కాలు నాకుతుంటే నిమ్మగ్గా కాలు లాక్కుని..చూసుకోకుండా చటుక్కున దాని తోక మీద కాలేశాడు. అది కుయ్యోమంది ఈసారి. జాలిగా చూశాడు దాన్ని. ఊరడింపుగా దాని తలపై నిమిరి, వేప చెట్టు పక్కనే వున్న నూతి లోంచి నీళ్ళు తోడుకొని మొహం కడుక్కునే కార్యక్రమం పూర్తి చేశాడు.

"సూడు...మీ అమ్మ నిద్దర లేసినట్టు లేదు... రోజూ నాకంటే ముందే లేసేది..."

అర్ధమైపోయినట్టే నల్లకుక్క గుడిసె తలుపు దగ్గరకెళ్ళి భౌ భౌ మంటూ వాలుగుపార్లు మొరిగి...చాలా? అన్నట్టుగా వెనక్కి తిరిగి చూసింది రామయ్య వంక.

గంగమ్మ లేచి ఇవతలికి రాలేదు గానీ... ఆ మనిషి గొంతు లోంచి మూలుగు వినపడింది బయటికి.

"ఏంటే మూలుగుతున్నావు?" చటుక్కున రెండంగల్లో గుడిసె లోకి తొంగి చూశాడు.

పొట్టమీద చేత్తో రాసుకుంటూ మూలుగుతోంది గంగమ్మ.

"ఏంటే? కడుపులో నెప్పా? నా పిచ్చి గానీ...రోజులకి రోజులు తిండి మానుకుంటే కడుపు నెప్పి గాక బుక్తాయాసం వస్తదా?"

దగ్గర కెళ్ళి ఒంటి మీద చేయి వేసి చూశాడు. వేడిగా వుంది.

"బెంగతో జొరం కూడా వొచ్చె" గొణుక్కున్నాడు లోలోపల.

కళ్ళు తెరిచింది గంగమ్మ.

"ఇయ్యాలమ్మ గారు పాలకొల్లు సంతలో పనసకాయలు తెమ్మన్నారు. మర్సిపోకు".

ఆ మాటలకి ఏడవాలో, నవ్వాలో తెలియలేదు రామయ్యకి. అటు గుండెల్లో దాసుకున్న ఏడుపూ కాదు, ఇటు ఒంటో బావులేని సంగతీ కాదు. మరేటో మాటాడతా వుంటే తెలియదా? మాట మార్చేందుక్కాక మరేటి? పోయిన వారం సంతరోజే కదా మల్లిగా డిల్లొదిలి పెట్టి పోయింది? ఔను...సరిగ్గా వారమైనాది. ఈ వారం దినాలుగా బెంగతో రెండు మెతుకులు కతికితే ఒట్టు ఈ పిచ్చి తల్లి! మాటా మంతీ మర్సిపోయిన దాన్లా దేవుడి పటం ముందు మూగదాన్లా కూచుమంది. కంట్లో నీళ్ళు కూడా ఇంకిపోయినట్టున్నాయి. మొహమంతా పీక్కుపోయింది.

"సూడు గంగీ! మనమంటే లెక్క లేనోడి కోసం ఎందుకే నీకంత బాద?"

"ఆడికి మనమంటే లెక్కలేదని, కన్న బిడ్డ మీద మమకారం సంపుకోగల్నా? ఏదో నాకు దైర్నం సెప్పాలని అంటన్నావే గానీ...లోపల నీకు మాత్తరం బాద లేదా?" అని గంగమ్మ అనడంతో గొంతులో ఏదో అడ్డుపడినట్టయి మాట రాలేదు రామయ్యకి.

మనసు విలవిల్లాడింది. తన పంచ పేణాలూ వాడు కాదా? ఆ తినే రెండు ముద్దలూ వాడితో కల్పి, వాడి పక్కనే కూసుని తింటే గాని గొంతు దిగని తనకి...వాడి వొళ్ళు నెప్పబడితే తగ్గిందాకా కంటిమీదికి కునుకే రాని తనకి...

తన మాదిరి కాకుండా తన బిడ్డ సదువుకోవాలని... వాడి కోసం తన సరదాలూ, అలవాట్లూ సంపుకుని, పైసా పైసా పొదుపుగా సూసుకుంటూ, వాడిని పెద్ద యిస్కూల్లో సదివించిన తనకి...వాడిల్లొదిలి పోతే బాదలేపోదనా?....

కూతురికి సదువు సెప్పించ లేదు గానీ, అక్క కొడుకుని అల్లుడిగా సేసుకుని...దాన్ని కాపరానికి పంపినాక, ఇంత వున్న ఆశలన్నీ...మమకారాలన్నీ కొడుకు మీదే పెట్టుకుని బతుకుతున్న తనకి బాద లేకపోదనా? ఒంట్లో జీవం అంతా వాడే లాక్కుపోయాడు కదా!...

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"గంగీ! ఆచారి గారి నడిగి మందట్టుకొస్తా!" అంటూ వొచ్చేటప్పుడు టీనీళ్ళు కొనుక్కురానికి గ్లాసొకటి తీసుకుని బయల్దేరాడు రామయ్య.

గంగమ్మ కళ్ళ ముందు కొడుకే మెదుల్తున్నాడు.

* * *

"సూడు మల్లిగా! అయ్యకి వొయసు పైబడి పోలా?"

"అయితే నన్నేం సెయ్యమంటావూ?"

"నీ సంపాదన ఒక్క నయాపైసా కూడా ఇంటికర్సు కియ్యనాయె! ఇన్ని దినాలుగా నేనూ నోరిప్పి సెప్పలేదు... అడగలేదు నువ్వే తెల్సుకోక పోతవా అని. ఓ దినం పనికి పోతే, ఓ దినం పోలేక ఆరోగ్గెం సరిలేదు. నువ్వే సూస్తన్నావు కదా!"

"ఆరోగ్గెం సరి లేకపోతే మందు లేసుకోమను. నాకెందుకూ సెప్పడం?"

"మందులకి డబ్బులు కావద్దురా? అయ్య తెచ్చే కూలి డబ్బులకి తిండి గడిసేదే గొప్ప మాట!"

"అంటే నాకేదో పిండి వంటలు సేసి పెడుతున్నావా రోజూ నువ్వు? కన్న కొడుక్కి తిండి పెట్టడం బారమై పోయిందా మీకు?"

"అయ్యయ్యో! అంత మాటలెందుకురా?" తల్లడిల్లి పోయింది తల్లి ప్రాణం.

ఇంతలో అటుగా వచ్చిన వెంకన్న నీళ్ళ మాటలు విని– "అది కాదురా మల్లిగా! ఆ తాగుడుకీ, ఆ సీట్లాటకీ నీ జీతం తగలేసుకుంటావయ్యో! ఒక్క పైసా కూడా ఇంటి కర్సుకని మీ అయ్య సేతికియ్యకపోతే, ఆయన మటుకెంతకని బండి లాగుతాడు సెప్పు?" అన్నాడు.

"ఇదిగో ఎంకన్న మావా నీకనవసరం. నువ్వు కలగజేసుకోకు. మా ఇంటి విషయాలు నీకెందుకూ?" కస్సుమన్నాడు మల్లిగాడు.

"అంతేలే అబ్బాయ్! నాయం మాట్లాడితే యినుకునే దెవరు? రేపు నీ పెళ్ళయి పిల్లలు పుట్టి ఆళ్ళిలా మాట్లాడితే అప్పుడు తెలుస్తాదిలే నీకు".

"ఏం కూశావ్!" కొట్టడానికి చెయ్యెత్తాడు మల్లిగాడు. సమయానికి రామయ్యొచ్చి అడ్డుకున్నాడు కాబట్టి సరిపోయింది గానీ, లేకపోతే ఆ రోజు మల్లిగాడి చేతిలో వెంకన్న బక్క



ప్రాణం ఏమయ్యేదో?

విసురుగా ఇంట్లోంచి వెళ్ళిపోయిన మల్లిగాడు మళ్ళీ రాలేదు.

రాత్రికి మల్లి గాడి నేస్తం చంద్రం వొచ్చి కబురు చెప్పి పోయాడు.

"మల్లిగాడీ ఊరొదిలి పట్నం పోయాడు. ఇంక ఎప్పటికీ మీ మొహం సూడనని సెప్పమన్నాడు".

ఒంట్లో శక్తంతా ఒక్కసారిగా ఎవరో లాగేసి నట్టు కుప్పకూలిపోయింది గంగమ్మ. గుండెల మీద పెట్టుకుని పెంచితే ఆ గుండెనే తన్నేసి పోతే ఇంక బతుకెందు కనిపించింది.

* * *

"అయ్య గారూ! గంగికి జొరం. మందేవన్నా ఇయ్యండయ్యా".

"అయ్యో పాపం! కొడుకు మీద బెంగతో జ్వరం వొచ్చేసినట్టుంది. ఇస్తానుండు మందు" అంటూ లోపలి కెళ్ళారు ఆచారి గారు.

"ఎవరూ? రామయ్యా నువ్వా? ఒక్క నిమిషం వుండు".

కిటికీ లోంచి చూసి కేకేసింది ఆచారి గారి భార్య. ఆవిడెందుకు పిల్చిందో అర్ధం కాలేదు రామయ్యకి.

"ఇదిగో రామయ్యా!" అంటూ నాలుగు లడ్డూలు, నాలుగు పూత రేకులూ పెట్టిన కవరు అందించిందావిడ.

"రాత్రి మా అమ్మాయికి పురుడొచ్చింది. ఆడపిల్ల పుట్టింది".

"అయితే అమ్మాయి గారికి మళ్ళా ఆడపిల్లే నన్న మాట. పాపం! ఈసారైనా మొగపిల్లవాడు కలగలేదు" యధాలాపంగా పైకి అనేశాడు వుండబట్టలేక.

మందు పొట్లాలు పుచ్చుకుని అప్పుడే బయ టికొచ్చిన ఆచారి గారు ఆకాశం వేపు చూసి చేతులు జోడించారు.

"ఆడపిల్లయితే మాత్రం ఏమిటిరా? తల్లీ బిడ్డా క్షేమంగా వుంటే అంతే చాలు".

"మరి...మరి...అది కాదయ్యా!"

"ఏమిట్రా నీ సందేహం?"

"కొడుకుల్లేకపోతే నరకానికి పోతారంటారు కదయ్యా!" బుర్ర గోక్కున్నాడు.

అంతలోనే నాలుక్కరుచుకున్నాడు, అలా అడిగినందుకు ఆచారి గారికి కోపం వస్తుందే మోనని.

"పిచ్చి సన్నాసీ! తల్లీ తండ్రీ బతికుం డగా పిడికెడన్నం పెట్టడానికి తన్నుకు చచ్చే కొడుకులున్న ఈ రోజుల్లో చచ్చిపోయాక ఆ కొడుకులు పెట్టే పిండం కోసం ఎందు కురా ఆశలు? బతికుండగా పెట్టని అన్నం చచ్చాక ఎవరిక్కావాల్రా?" ఆయన గొంతులో ఆవేదనతో కూడిన ఆవేశం తొంగిచూసింది.

'ఎంత నిజం సెప్పారు! అయ్యగారన్నది కోట్ల విలువ సేసే మాట'.

ఆ క్షణంలో ఆయన మాటల్తో ఏదో జ్ఞానో దయం అయినట్టయింది రామయ్యకి.

తమ బాగోగులు పట్టించుకోని కొడుకులు.. ఎక్కడో దూరాభారాన వున్న కొడుకులు ముగ్గురూ మనసులో మెదిలినట్టున్నారు ఆచారి గారికి. శూన్యం లోకి చూస్తూండి పోయారు.

* * *

"గంగీ! ఈ మందేసుకో..లే..జొరం గిరం ఎగి రిపోతాది" గంగి తల కింద చెయ్యి వేసి మెల్లిగా లేవదీసి మందు మింగించాడు రామయ్య.

తర్వాత కాసేపట్లో టీ నీళ్ళు కూడా తాగాక ఓపిక తెచ్చుకుని గోడకానుకుని కూచుంది గంగమ్మ.

ఎదురుగా తనూ కూచున్నాడు రామయ్య.

వాడి మొహంలోకి చూసిన గంగమ్మ ఆశ్చ ర్యపోయింది. వారం రోజులుగా వున్న నీరసం, దిగులూ ఇప్పుడు వాడిలో లేవు. మొహం తేటగా వుంది. కొడుకు ఇల్లొదిలి వెళ్ళి పోయిన దుఃఖం వారం రోజులుగా వాడి కళ్ళల్లో గూడు కట్టుకునే వుంది. కానీ ఇప్పుడు ఆచారి గారింటి నుంచి వొచ్చిన ఈ కాసేపట్లోనే ఎంత తేడా వుంది వాడి మొహంలో...

"కొత్త సినిమా వొచ్చిందటనే... నీకు జొరం... తగ్గాక సినిమా కెళ్దాం" అన్నాడు.

'ఈడికి పిచ్చి పట్టలేదు కదా!' అనుకుంటూ తెల్లబోయి చూసింది గంగమ్మ.

తోక వూపుకుంటూ నల్లకుక్క లోపలికి దూరి గంగమ్మ పక్కన చేరి కుయ్యి కుయ్యి మంటూ పరామర్శించింది, 'ఎలా వుంటదిప్పుడు నీ ఒంట్లో?' అన్నట్టుగా.

"నిన్న రాతిరి ఇది నా పక్కన జేరి కుయ్యి కుయ్యి మని గోల సేత్తా వుంటే కడుపు నొప్పి, జొరం సిరాకులో బాగా కొట్టానయ్యా దీన్ని. అయినా పాపం వొచ్చి నా పక్కనెట్టా సేరతా వుందో సూడు" జాలిగా దాన్ని చూస్తూ అంది గంగమ్మ.

"ఔనే! అది కుక్క! మనిసి కాదుగా యిష్వాసం లేకపోవడానికి" రామయ్య గొంతులో కదలాడిన జీర గంగమ్మ మనసుకి అర్ధమైంది.